సాక్షి
అన్నమయ్య జిల్లా

శనివారం । 10 । ఆగస్టు । 2024



బడుల్లో పచ్చ రాజకీయం

ప్రభుత్వ బడుల్లోనూ అధికారపార్టీ రాజకీయ రంగు పులిమింది. విద్యార్థుల అవస్థల గురించి ప్రశ్నించే ఎస్‌ఎంసీల్లో తమవారిని నియమించుకునే ఎత్తుగడ వేసింది. -8లో

● మోడీతో జోడీ కట్టి..

● ముస్లింలపై రుబాబు ● బట్టబయలైన సీఎం కపటప్రేమ

● మండిపడుతున్న మైనారిటీలు

వక్ఫ్ బిల్లుకు జైకొట్టి!

చంద్రబాబు ముసుగు తొలగింది. ముస్లింలకు అండగా ఉంటానన్న ఆయన మాటలు నీటిపై రాతలేనని పార్లమెంట్ సాక్షిగా రుజువైంది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లుకు ఏకపక్షంగా మద్దతివ్వడంతో బాబు నిజస్వరూపం బట్టబయలైంది. లౌకిక రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న బీజేపీతో జత కూడినప్పుడే బాబు తీరుపై ముస్లింలలో అనుమానం కలిగింది. తాజా వక్ఫ్ సవరణ బిల్లుకు ఆమోదం తెలపడంతో ఆ అనుమానం నిజమైంది. బాబు కూడా ఆ తాను ముక్కేనని... తాను నడిచేది ఆ'కాషాయ' ఛాయల్లోనేనని తెలిసిపోయింది.




సాక్షి ప్రతినిధి, కడప: కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును టీడీపీ ఏకపక్షంగా మద్దతివ్వడంపై ముస్లింలు భగ్గుమంటున్నారు. ముస్లింలకు తోడుగా ఉంటానంటూనే మోదీకి తోడై .. తోడేళ్ల పన్నాగం పన్నుతావా అంటూ ధ్వజమెత్తుతున్నారు. వక్ఫ్ ఆస్తులకు రక్షణగా ఉంటామంటూనే 'ఉఫ్'మని లాగేసేందుకు నక్కజిత్తుల ఎత్తులేస్తున్నావా అంటూ మండిపడుతున్నారు. మరో వైపు పార్లమెంట్‌లో వక్ఫ్ సవరణ బిల్లును వైఎస్సార్‌సీపీ తీవ్రంగా వ్యతిరేకించడంతో ముస్లింలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్ జగన్ ఎప్పుడూ ముస్లింల పక్షపాతేనని కొనియాడుతున్నారు. వక్ఫ్ సవరణ బిల్లును పూర్తిగా ఆపేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. మైనార్టీలకు ఏ కష్టమొచ్చినా.. ఏ నష్టం జరిగినా అండగా ఉంటామంటూ చెప్పిన టీడీపీ, జనసేన పార్టీలు ఇప్పుడెలా మద్దతిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఇప్పుడైనా రెండు నాల్కల ధోరణిని మానుకోవాలని హితవు పలుకుతున్నారు.

చూస్తూ ఊరుకోం..



ప్రభుత్వం వెంటనే వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి. వక్ఫ్ చట్టంలో ఇష్టారాజ్యంగా సవరణలు చేయడాన్ని ఖండిస్తున్నాం. ముస్లింల హక్కులను దోచుకుంటామంటే చూస్తూ ఊరుకోం. కచ్చితంగా అడ్డుకుంటాం.
– షేక్ అబ్దుల్ ఖాదర్, నందలూరు

రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తారా



వక్ఫ్ బోర్డుల ఆస్తులను కాపాడేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మైనార్టీలకు కల్పించిన హక్కులను కాలరాసే అధికారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎవరిచ్చారు. వక్ఫ్ బోర్డు ఆస్తులపై పెత్తనం చెలాయించేందుకు ప్రయత్నించడం అంటే మైనార్టీల మనోభావాలను దెబ్బతీయడమే అవుతుంది. భారతదేశంలో అన్ని మతాలకు చెందిన వారు ఉన్నారని, అలాగే అన్ని మతాలకు చెందిన మతపరమైన ప్రార్థన స్థలాలకు చెందిన ఆస్తులు కూడా ఉన్నాయి. వాటిని కూడా ఇలాగే దెబ్బతీస్తారా...దీనిని తెలుగు దేశం పార్టీ సమర్థించడం బాధాకరం
-జాకీర్, వక్ఫ్‌బోర్డు అన్నమయ్య జిల్లా డైరెక్టర్

మోసం..బాబు నైజం




సీఎం నారా చంద్రబాబు నాయుడు మొదటి నుంచి ముస్లింలకు వ్యతిరేకంగానే వ్యవహరిస్తున్నారు.ఓట్లకోసం వారిని వాడుకుని మోసం చేయడం ఆయన నైజం. తెలుగుదేశం ప్రభుత్వానికి గుణపాఠం చెబుతాం. – ముజీబ్,
పెద్ద మసీదు అధ్యక్షుడు, రైల్వేకోడూరు

ఉపసంహరించుకోవాలి




లోక్‌సభలో ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిలులను ఉపసంహరించుకోవాలి. సమాజంలో ఓ వర్గాన్ని లక్ష్యంగా చేసుకొని రూపొందించిన బిల్లుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. . మైనార్టీలను రక్షించే విషయంలో బిల్లుపై లోక్‌సభలో ప్రధానపార్టీలు వ్యతిరేకించాయి. -హైదర్, మతపెద్ద, రాజంపేట

ఆస్తులను కొల్లగొట్టడానికే..



వక్ఫ్‌బోర్డు ఆస్తులను కొల్లగొట్టేందుకు మోదీ ప్రభుత్వం ఈ విధమైన చట్టాలు చేస్తోంది. తాము పవిత్ర హజ్ యాత్రకు వెళ్లే సదుపాయం లేకుండా పోతుంది. ప్రభుత్వం ద్వారా తమకు అందే రాయితీలు తగ్గిపోతాయి. దీనికి టీడీపీ మద్దతు ఇవ్వడం మోసపూరిత చర్య.
-సయ్యద్ సత్తార్ సాహెబ్, మైనార్టీ నాయకులు, ఒంటిమిట్ట

టీడీపీ మద్దతు దారుణం



వైఎస్‌ఆర్‌సీపీ ఎంపీలు వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంటులో వ్యతిరేకించడం హర్షనీయం. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకించి మైనార్టీలకు మరోసారి అండగా నిలిచారని రుజువైంది. దీనికి తెలుగుదేశం పార్టీ మద్దతు ఇవ్వడం దారుణం
– సయ్యద్ సయ్యద్‌నూర్, కో–ఆప్షన్ సభ్యుడు, సిద్దవటం

కచ్చితంగా అడ్డుకుంటాం



ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి. వక్ఫ్ చట్టంలో ఇష్టారాజ్యంగా సవరణలు చేయడం సరికాదు. బిల్లు వెనక ఉద్దేశం ఏమిటో ప్రభుత్వం బయట పెట్టాలి. ముస్లింల హక్కులను దోచుకుంటామంటే చూస్తూ ఊరుకోం. కచ్చితంగా అడ్డుకుంటాం. -రఫీక్‌అహ్మద్, మైనార్టీ నాయకులు, మదనపల్లె

కక్షసాధింపు తగదు




కూటమి ప్రభుత్వం ముస్లిం మైనారిటీలపై కక్షసాధింపు చర్యలు తగవు. పార్లమెంటు వక్ఫ్‌బోర్డు బిల్లుకు టీడీపీ కూడా మద్దతు ఇవ్వడం చూస్తుంటే ముస్లింల ఉనికిని దెబ్బతీయడమే. దీన్ని అందరూ వ్యతిరేకించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.
– హబీబ్‌బాషా, పీలేరు

టీడీపీ ముస్లిం వ్యతిరేకి..



సమాజాన్ని విచ్ఛిన్నం చేసే ప్రయత్నంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఒక సవరణ బిల్లును ప్రవేశపెట్టింది. దీనికి తెలుగుదేశం పార్టీ మద్దతు తెలపడం దారుణం ముస్లింలపట్ల వ్యతిరేకంగా వ్యవహరిస్తోంది. – సుంకేశుల రఫీ,
జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్, అన్నమయ్య జిల్లా



పచ్చ మూకల దాడిలో ధ్వంసమైన సామాజిక న్యాయ మహా శిల్పం బోర్డు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరు

నారోన్మాదం



వైఎస్సార్ జిల్లా బద్వేలులో అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలియజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

విగ్రహంపై దాడి సిగ్గుచేటు



విజయవాడలో డాక్టర్.బీ.ఆర్.అంబేడ్కర్ విగ్రహంపై దాడి చేయడం సిగ్గుచేటు. ప్రజాస్వామ్యానికి అవమానకరం. టీడీపీ కూటమి ప్రభుత్వం కనుసన్నల్లోనే 125 అడుగుల విగ్రహం కూల్చివేతకు ప్రయత్నం జరిగింది.ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి.మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ విజయవాడ నడిబొడ్డున అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుచేస్తే చూస్తూ జీర్ణించుకోలేకపోతున్నారు.విగ్రహం ఉన్న చోట సీసీ కెమెరాలను పటిష్టపరచాలి. – యమలాసుదర్శనం,
మాల మహానాడు జాతీయ అధ్యక్షులు

మరో రాజకీయ విధ్వంసం



విజయవాడ నగరం నడిబొడ్డున మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఏర్పాటుచేసిన డా.బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయం విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన శిలాఫలకం ధ్వంసం సంఘటన మరో రాజకీయవిధ్వంసమే. విజయవాడలోకి ప్రవేశించగానే కనిపించే 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం వద్ద విద్యుత్ సరఫరా నిలిపివేసి కొందరు దుర్మార్గులు చేసిన సంఘటన సిగ్గుచేటు. దుండగలు ఎవరైనా సరే చట్టపరంగా కఠినంగా శిక్షించాలి. –దండుమణి,
రిటైర్డ్ ఎస్‌బీఐ బ్యాంక్‌మేనేజరు, రాజంపేట

అవమానకరం



భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి విజయవాడలో జరిగిన అమానుషం భారతజాతికే అవమానం. అంబేడ్కర్ విగ్రహాన్ని కూల్చేందుకు టీడీపీ మూకలు ప్రయత్నించడం వారి వికృత చేష్టలకు పరాకాష్ట. భారతజాతి గర్వించదగ్గ మహానాయకుడు అంబేడ్కర్ పట్ల నీచంగా ప్రవర్తించిన వారిని ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా కఠినంగా శిక్షించాలి. –రుద్రిరాల రమణ,
రాఘవ రాజపురం, రైల్వే కోడూరు

హేయమైన చర్య



టీడీపీ మూకలు అంబేడ్కర్ విగ్రహంపై దాడి, శిలాఫలకం ధ్వంసం చేయడం హేయమైన చర్య. అంబేడ్కర్ విగ్రహంపై దాడి చేయడమంటే రాజ్యాంగాన్ని అవమానించడమే.అలాంటి వారికి సమాజంలో ఉండే అర్హత లేదు. చంద్రబాబు, లోకేష్‌లు బాధ్యత తీసుకోవాలి. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారినిక కఠినంగా శిక్షంచాలి.
–చంద్రశేఖర్, సర్పంచ్,
బుడుగుంటపల్లి, రైల్వేకోడూరు

దాడి అమానుషం



దేశ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహంపై దాడి చేయడం అమానుసం. ఇలాంటి దాడులను తీవ్రంగా ఖండిస్తున్నాం. దాడికి పాల్పడిన దుండగులపై తక్షణ చర్యలు తీసుకోవాలి. ఇలాంటి దాడులకు పాల్పడకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహించాలి. – టి.ఎల్. వెంకటేష్,
సీపీఐ నాయకులు, పీలేరు

దళితులపై చిన్న చూపు



టీడీపీ ప్రభుత్వానికి దళితులంటే తొలి నుంచి చిన్న చూపే. సీఎం చంద్రబాబు తన హయాంలో ఎన్నడూ అంబేడ్కర్ విగ్రహాన్ని పెట్టాలన్న ఆలోచన చేయలేదు. పెట్టిన తర్వాత ఏ ప్రభుత్వం అయినా ఆయన విగ్రహాన్ని గౌరవించాల్సిందే.
– రామాజి ఇమ్మానుయేల్, రాష్ట్ర మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు

న్యూస్‌రీల్

శ్రీ సౌమ్యనాథ సేవా ట్రస్టు నిధులు రూ.2,03,50,735

నందలూరు: సౌమ్యనాథస్వామి ఆలయ సమీపంలోని శ్రీసౌమ్యనాథ సేవా ట్రస్టు వారి నిధులు వివిధ బ్యాంకులలో 2,03,50,735లు ఉన్నాయని ట్రస్టు చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడు పేర్కొన్నారు. శుక్రవారం బోర్డు సమావేశం నిర్వహించి ట్రస్టు ఆదాయ, వ్యయాలు పరిశీలించి ఆమోదించారు. ట్రస్టు తరపున విరాళాలు అందజేసి సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. కోశాధికారి చక్రాల రామసుబ్బన్న, కార్యదర్శి సైలేంద్రనాథ్, సభ్యులు పల్లె సుబ్రమణ్యం, గంటా వాసు దేవయ్య, జంగం శెట్టి వెంకటసుబ్బయ్య, మోడపోతుల రాము, సర్దార్ హుస్సేన్, లంకాయగారి సుబ్బరామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

వీవీ కండ్రిక పాఠశాల సమస్యలు తీరుస్తాం



పాఠశాలలోని విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ

సాక్షి ఎఫెక్ట్..

రైల్వేకోడూరు అర్బన్: అన్నమయ్య జిల్లా సాక్షి దిన పత్రికలో ఆగస్టు 9వ తేదీ(శుక్రవారం) ..'సౌకర్యాలు కొరవడి వెనుక'బడి'.. అనే కథనానికి జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు శుక్రవారం ఎంఈఓ రామయ్య పాఠశాలను తనిఖీ చేసారు. అలాగే విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకొన్నారు. పాఠశాలలో సమస్యలు తీరుస్తామన్నారు. విద్యార్థులకు సరైన మౌలిక సౌకర్యాలు కల్పించడానికి కృషి చేస్తామన్నారు. ఉపాధ్యాయులు సక్రమంగా వచ్చేవిధంగా చర్యలు తీసుకొని విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తామని తెలిపారు. అన్ని విషయాలపై ఉన్నతఅధికారులకు నివేదిక పంపిస్తామని తెలిపారు.

నేడు గండిలో తొలి శనివారోత్సవం



విద్యుద్దీపాల అలంకరణలో గండి అంజన్న ఆలయం



గండి వీరాంజనేయ స్వామి మూలవిరాట్

చక్రాయపేట: పవిత్ర పుణ్యక్షేత్రమైన గండిలో శ్రావణ మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. నేడు తొలి శ్రావణమాస ఉత్సవం జరుగనుంది.' ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.ప్రాంగణంలో పలు దేవతా మూర్తుల డిజిటల్ కటౌట్లను ఏర్పాటు చేశారు. వీఐపీ పాసులు ఉన్న వారికి ఉదయం 5నుంచి 8గంటల వరకు, సాయంత్రం 5నుంచి 8గంటల వరకు మాత్రమే అనుమతి ఉంటుందని ఆలయ అధికారి తెలిపారు. ఈవిషయాన్ని భక్తులు గమనించాలని కోరారు. గండి ఉత్సవాల సందర్భంగా ఆలయ ఆవరణంలో రక్తదాన శిభిరం ఏర్పాటు చేసినట్లు ట్రిపుల్ ఐటీకి చెందిన ప్రసాద్ తెలిపారు.ముందుగా పేరు నమోదు చేసుకోవాలనుకున్న వారు 8106473271 నంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

భారీ బందోబస్తు ఏర్పాటు: శ్రావణ మాసం సందర్భంగా తొలి శనివారం గండి అంజన్న సన్నిధిలో జరిగే ఉత్సవాలకు పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆర్కే వ్యాలీ సీఐ గోవిందరెడ్డి తెలిపారు. పులివెందుల డీఎస్పీ మురళి ఆధ్వర్యంలో సుమారు 130 మంది పోలీసులు, పోలీసు అధికారులు బందోబస్తులో పాల్గొంటున్నట్లు చెప్పారు లారీలను సాయంత్రం వరకు అద్దాలమర్రి క్రాస్,ఇడుపులపాయ క్రాస్‌ల వద్దనే ఆపేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్కే వ్యాలీ ఎస్సై రంగారావు పాల్గొన్నారు.

ఉన్నత చదువులపై గిరిజన పిల్లలు శ్రద్ధ చూపాలి

జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి: గిరిజన పిల్లలు ఉన్నత చదువులపై శ్రద్ధపెట్టి చదవాలని, మంచి భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం రాయచోటి కలెక్టరేట్ ఆవరణలో జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థినీ విద్యార్థులకోసం ప్రతి జిల్లాలో ప్రభుత్వం గిరిజన వసతి గృహాలను ఏర్పాటు చేసిందన్నారు. జిల్లాలో గిరిజన పాఠశాలలో చదువుకుంటూ పాటలలో మంచి ప్రతిభ కనబరిచిన కొంతమంది విద్యార్థునులకు మెమెంటోలను జిల్లా కలెక్టర్ అందించారు. జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి తేజస్వినీ మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసీల సంస్కృతి, వారి సంప్రదాయాన్ని గుర్తించదానికి 1994లో ఐక్యరాజ్య సమితి ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని గుర్తించిందన్నారు. ఆదివాసీలు పర్యావరణ పరిరక్షణకు, సేంద్రీయ వ్యవసాయానికి, అడవుల పరిరక్షణకు ఎంతో కృషి చేశారన్నారు. జిల్లాలోని గిరిజన నాయకులు నాగేంద్ర నాయక్, రామ్మూర్తి నాయక్, విశ్వనాథ నాయక్, రత్నమ్మ, తదితరులు మాట్లాడారు.



మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

మనందరం అడవిలో పుట్టిన బిడ్డలమే

రాయచోటి టౌన్: మనందరం అడవిలో పుట్టి పెరిగిన బిడ్డలమేనని కలెక్టర్ చామకూరి శ్రీధర్ గిరిజన విద్యార్థులకు తెలిపారు. శుక్రవారం రాయచోటి – రాజంపేట రోడ్డులో ఉన్న గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం సమావేశం నిర్వహించి వారితో ముచ్చటించారు. ఆగస్టు 9న ఆదివాసి దినోత్సవంగా ఎందుకు ప్రకటించారనే ప్రశ్నను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అడవి తల్లిని నమ్ముకొని జీవనం సాగించే అడవి బిడ్డల కోసం ప్రపంచ వ్యాప్తంగా ఈ రోజును ఆదివాసి దినోత్సవంగా ప్రకటించారని తెలిపారు. గిరిజన బిడ్డల సంక్షేమం కోసం ఇలాంటి గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశారని, శ్రద్ధగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. గురుకులంలో ఉపాధ్యాయుల కొరత లేకుండా ప్రయత్నిస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారిణి తేజశ్వని, ఇతరా అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చౌక దుకాణంలో బియ్యం మాయం

బి.కొత్తకోట : చౌక దుకాణాలలో సీఎస్‌డీటీ వెంకటరెడ్డి శుక్రవారం దాడులు నిర్వహించారు. స్థానిక ఒకటో నెంబర్ దుకాణంలో వినియోగదారులకు పంపిణీ చేయగా.. మిగిలిన 11.50 క్వింటాళ్ల కిలోల బియ్యం, 19 కిలోల కందిపప్పు, ఆరు కిలోల రాగిపిండి లేదని నిర్ధారించి డీలర్‌పై 6ఎ కేసు నమోదు చేశామని వెంకటరెడ్డి తెలిపారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన గేదె

సిద్దవటం : మండలంలోని లింగంపల్లె గ్రామానికి చెందిన దళిత రైతు వెంకటసుబ్బయ్యకు చెందిన గేదె శుక్రవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. వెంకటసుబ్బయ్య గేదెలను మేతకు తీసుకువెళ్తుండగా.. ఓ గేదె పొలాల్లోకి వెళ్లింది. అక్కడ విద్యుత్తు తీగలు తగిలి షాక్‌తో మృతి చెందింది. రూ.60 వేలు నష్టపోయినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

భారీ ఇసుక డంప్ సీజ్



అధికారులు సీజ్ చేసిన ఇసుక డంపు

గుర్రంకొండ : మండలంలోని మర్రిపాడు పంచాయతీ ఉసిరికాయలపల్లె సమీపంలో భారీ ఇసుక డంప్‌ను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. గ్రామానికి సమీపంలోని హంద్రీనీవా కాలువ పరిసరాల్లో శుక్రవారం భారీగా ఇసుక డంప్‌లున్నాయనే సమాచారం అందుకొన్న వీఆర్వో ప్రవీణ్ 50 లోళ్ల ఇసుక డంపును గుర్తించారు. తహసీల్దారు శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లి డంపును సీజ్ చేసి వీఆర్‌ఏను కాపలా ఉంచినట్లు ప్రవీణ్ తెలిపారు. సీజ్ చేసిన ఇసుక విలువ రూ. 2 లక్షల వరకు ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

బడుల్లో పచ్చ రాజకీయం

రాజకీయాలకు అతీతంగా నిర్వహించాల్సిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికల్లోనూ టీడీపీ బరి తెగించింది. దౌర్జన్యాలు బెదిరింపులకు పాల్పడింది. పాఠశాలల్లో విద్యార్థుల అవస్థల గురించి ప్రశ్నించే ఎస్ఎంసీల్లో తమవారిని నియమించుకునే ఎత్తుగడ వేసింది. ఇకమీదట స్కూళ్లలో ఏమి జరిగినా ప్రభుత్వాన్ని నిలదీయకుండా ఉండేందుకు పక్కా స్కెచ్ వేసింది. పేదలకు ప్రభుత్వ విద్యను అందని ద్రాక్షగా మార్చేందుకు పన్నాగం పన్నింది. అధికారులను గుప్పిట్లో పెట్టుకుని ఈ తతంగమంతా నడిపింది. పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడం తప్ప ఏమీ చేయలేకపోవడం గమనార్హం.

జిల్లా అంతటా ప్రశాంతం పేరుతో ఏకపక్షం	ఎన్నికలు నిర్వహించిన పాఠశాలలు	ఏకగ్రీవంగా ఎన్నికైనవి	ఎన్నికల ద్వారా ఎన్నుకున్నవి	వాయిదా పడినవి	మూతపడిన పాఠశాలలు
	2183	1627	532	24	9



రామస్వామిరెడ్డిని బయటకు పంపుతున్న దృశ్యం



పింఛా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నికలు నిర్వహిస్తున్న దృశ్యం

రాయచోటి/సాక్షి నెట్‌వర్క్ : పేద, మధ్యతరగతి విద్యార్థులకు దేవాలయాలైన ప్రభుత్వ బడుల్లోనూ అధికారపార్టీ రాజకీయ రంగు పులిమింది. కూటమి ప్రభుత్వం పాఠశాల కమిటీల పేరుతో పాఠశాలల్లో అధికార దర్పాన్ని ప్రదర్శిస్తూ ఏకపక్షంగా కమిటీలను ఎన్నుకుంటూ కొత్త రాజకీయానికి తెర లేపింది. పాతాళంలో ఉన్న ప్రభుత్వ విద్యకు గత ప్రభుత్వం ఊపిరి పోయగా కూటమి ప్రభుత్వం వచ్చిందే తడవుగా పాఠశాలల్లో ఎన్నికల పేరుతో అధికార దర్పాన్ని అడ్డుపెట్టి శాంతియుతమనే పేరుతో ఏకపక్ష ఎన్నికకు తెరలేపింది. భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేలా చదువుకునే చిన్నారుల కళ్లెదుటే నిబంధనలు కాలరాస్తూ తమ ఆదేశానుసారమే విద్యా కమిటీ సభ్యులు, చైర్మన్‌లను ఎన్నుకోవాలంటూ కూటమి నాయకులు అనధికారికంగా హుకుం జారీ చేశారు. పాఠశాల్లో ఉపాధ్యాయుల కొరతతోపాటు స్థానికంగా నెలకొన్న సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్న ఆశించిన విద్యార్థులు వారి తల్లిదండ్రులకు ఎన్నికల రూపంలో చంద్రబాబు మార్కు ప్రదర్శన చూపించారు. విద్యార్థులకు విద్యను బోధించే ఉపాధ్యాయుల చేతులతో బలవంతమైన కమిటీల ప్రకటనలు ఇలాంటి సంకేతాలను అందిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

అంతా ఇష్టానుసారం..

జిల్లాలో ఎస్ఎంసి ఎన్నికలు అధికార పార్టీకి అనుకూలంగా అసలు విషయం చెప్పాలంటే ఏకపక్షంగా ఎన్నికలను జరుపుకున్నారు. టీడీపీ నేతలు అధికార బలాన్ని చూపించి ఇష్టానుసారంగా ఎన్నికలను నిర్వహించారు. ఇదేమని ప్రశ్నించిన విద్యార్థుల తల్లిదండ్రలకు సమాధానం దొరకలేదు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా అధికార పార్టీ నాయకులు చెప్పిన పేర్లు కమిటీ సభ్యులు, చైర్మన్ అభ్యర్థులుగా నియామకాలను చేస్తూ అధికారులు ఉత్తర్వులు ఇవ్వాల్సి వచ్చింది. జిల్లాలోని రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు, మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి నియోజకవర్గాలలోని ఏ ఒక్క పాఠశాలలో నిబంధనలు మేరకు ఎన్నికలు నిర్వహించిన పాపాన పోలేదు. ఆ పార్టీకి అనుకూలమైన వ్యక్తుల పేర్లను ముందుగానే ఎంపిక చేసుకున్నారు. ఇలా ఎంపిక చేసుకున్న పేర్లను విద్యాశాఖ అధికారులకు అందజేసి ఆ పేర్లను చైర్మన్‌లుగా ఖరారు చేయించారు. జిల్లా వ్యాప్తంగా 30 మండలాలలో ఇదే తీరును ప్రదర్శించిన ప్రాథమిక పాఠశాలల ఎన్నికలను సైతం రాజకీయ దర్పంతో నింపివేశారు. సుండుపల్లి మండలం. ముడుంపాడు పంచాయతీలోని పింఛా జిల్లా పరిషత్ ఎన్నికల్లో మండల వ్యాప్తంగా ఉన్న టీడీపీ నేతలు అంతా హాజరై అక్కడున్న సర్పంచ్ (వైసీపీ నేత)ను పోలీసుల సాయంతో బయటకు పంపి వారు అనుకున్న వ్యక్తులను చైర్మన్ సభ్యులుగా ఎంపిక చేశారు. మదనపల్లి రూరల్ మండల పరిధిలోని బత్తిన కొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ట ఇడిపి, జనసేన పార్టీల నాయకులు చైర్మన్ పదవికి పోయి పడటంతో ఆ ఎన్నిక గురువారం వాయిదా పడింది. శుక్రవారం మదనపల్లి ఎమ్మెల్యే జోక్యంతో కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా ముగిసింది. ఇలా రాజకీయ ఒత్తిడిలు అధికంగా ఉండటంతో అనేక గ్రామాలలో ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నికలకు దూరంగా ఉండిపోయారు. దీంతో అధికార పార్టీకి అనుకూలంగా కమిటీ సభ్యులు చైర్మన్‌ను ఎన్నుకొని ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించినట్లు ప్రచారం చేసుకోవడం కూటమి సభ్యులకే చెల్లింది.

పెద్దతిప్పసముద్రం మండలంలోని మొత్తం 69 ప్రభుత్వ స్కూళ్ళలో గురువారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు జరిగాయి. అయితే 90 శాతం స్కూళ్లలో అంతా టీడీపీ నాయకులు ఏకపక్షంగానే నిర్వహించారు. ప్రధానంగా జెడ్పీ హైస్కూల్, మోడల్ స్కూళ్ళలో అంతా కూటమి నాయకులే హల్‌చల్ చేసారు. కూటమికి అనుకూలంగా ఉన్న వారినే చైర్మన్లుగా ఎన్నుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక్కో జెడ్పీ హైస్కూల్ ఒక పోలీస్‌ను ముందస్తుగా బందోబస్తు నిర్వహించినా కమిటీలను అడ్డదారిలో కైవసం చేసుకున్నారు. పలు చోట్ల ఓటింగ్‌కు హాజరైతే మీ పెన్షన్లు, రేషన్ కార్డులు రద్దు చేసేస్తామని పిల్లల తల్లిదండ్రులను బెదిరించారు. ఐదేళ్ళు మాదే పై చేయిగా ఉండాలని దౌర్జన్యాలకు దిగారు. మరో స్కూల్లో ఒక వ్యక్తిని తల్లిదండ్రులు చైర్మన్‌గా ఎన్నుకుంటే ఈ విషయాన్ని జీర్ణించుకోలేని టీడీపీ నాయకులు తమపై దాడి చేసారని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసారు. తంబళ్లపల్లి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని స్కూళ్లలో ఇదే తంతు జరిగింది.

2183 పాఠశాలలో ఎన్నికలు....

అన్నమయ్య జిల్లా పరిధిలోని 30 మండలాలు, మూడు నగరపాలక పంచాయతీలలో ఉన్న 2183 పాఠశాలలో గురువారం ఎన్నికలు నిర్వహించారు. వీటిలో 1627 పాఠశాలల్లో ఏకగ్రీవంగా ఎన్నికలు జరుగగా. 532 పాఠశాలలో ఎన్నికలు జరిగినట్లు అధికారులు నివేదికలో పేర్కొన్నారు. 24 పాఠశాలల్లో మాత్రమే వివిధ కారణాల పేరుతో ఎన్నికలు వాయిదా పడగా మరో 9 పాఠశాలలో విద్యార్థులు లేక ఎన్నికలను నిర్వహించలేదు.

ప్రశాంతంగా పాఠశాల కమిటీ ఎన్నికలు.....

జిల్లాలో ఈనెల 8వ తేదీన పాఠశాల కమిటీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి శివ ప్రకాష్ రెడ్డి తెలిపారు. జిల్లాలో 2183 పాఠశాలలు ఉండగా వివిధ కారణాలతో 24 పాఠశాలల్లో ఎన్నికలు వాయిదా పడ్డాయి అన్నారు. వాటిలో కూడా ప్రభుత్వ ఆదేశానుసారం ఎన్నికలను నిర్వహిస్తామని డీఈఓ తెలిపారు.

చాలా పాఠశాలల్లో ఫలితాలు తారుమారు



ప్రమాణం చేస్తున్న కస్తూరిరాజుగారిపల్లె ఎస్సీకాలనీ ప్రాథమిక పాఠశాల విద్యాకమిటీ సభ్యులు

లక్కిరెడ్డిపల్లి మండలంలో 69 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా అందులో 54 ప్రాథమిక, ఆరు ప్రాథమికోన్నత, 9 ఉన్నత పాఠశాలలతో పాటు ఒక ఆదర్శపాఠశాల, కస్తూర్బాగాంధీ పాఠశాల, బాలయోగి గురుకుల పాఠశాలలు ఉన్నాయి. గురువారం మండలంలో 68 పాఠశాలలకు ఎన్నికలు నిర్వహించగా దయ్యాలవాండ్లపల్లె పాఠశాల ఎన్నిక అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గడంతో వాయిదా పడింది. కస్తూరిరాజుగారిపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు సుజాత పోలీసుల సమక్షంలో ఎన్నిక నిర్వహించి కమిటీ చైర్మన్‌గా బాలగుండ్ల వెంకటరమణను ఎన్నుకున్నట్లు నియామక పత్రంను అందజేసి ప్రమాణం చేయించారు. సాయంకాలానికి ఓ ఓటింగ్ చెల్లదంటూ ఎంఈఓ ఆఫీస్‌కు సమాచారాన్ని అందజేసినట్లు తెలిపారు. ఈ విషయంపై శుక్రవారం సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుజాతను ఫోన్ ద్వారా ఎన్నికపై విచారణ కోరగా కోరంలేక వాయిదా వేయడం జరిగిందని తెలిపారు. ఉత్తరమెట్ట ఎస్సీ కాలనీలో పది మంది విద్యార్థులు తల్లిదండ్రులకు ఓటు హక్కు ఉండగా తొమ్మిది మంది చేతులెత్తి లక్కిరెడ్డిపల్లి ఓబులమ్మను చైర్మన్‌గా ఎన్నుకున్నట్లు ప్రకటించి ఎంఈఓ కార్యాలయానికి సమాచారాన్ని అందించినట్లు తెలిపారు. సాయంకాలానికి ఆ ఎన్నిక చెల్లదంటూ ఎంఈఓకు తెలియజేసినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తెలిపింది. చాగలగొట్టపల్లి ప్రాథమిక పాఠశాలలో అధికార పార్టీకి తలొగ్గి ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయంకాలానికి ఫలితాలు తారుమారు చేసి టీడీపీ మద్దతుదారుడిని చైర్మన్‌గా నియమించినట్లు ఎంఈఓ కార్యాలయానికి సమాచారాన్ని అందజేశారు. దియ్యలవాండ్లపల్లి ప్రాథమిక పాఠశాలలో అధికార పార్టీ నాయకులు ఒత్తిడి తేవడంతో మా పిల్లల టీసీలు ఇచ్చేస్తే మేము బయట చేర్చుకుంటామంటూ విద్యార్థుల తల్లిదండ్రులు తిరగబడటంతో చేసేదేమి లేక ఎన్నిక వాయిదా వేశారని గ్రామస్తులు తెలిపారు. దిన్నెపాడు, మద్యరేవుల, కుర్నూతల తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో ఇదే తంతు కొనసాగడంతో పోలీసులు కేసులు బనాయిస్తామని హెచ్చరికలు జారీ చేశారు.దీంతో కొందరు స్కూల్ కమిటీ ఎన్నికలలో పాల్గొనకుండానే ఉండిపోయారు. ప్రభుత్వం అధికారాన్ని అడ్డుపెట్టుకొని దౌర్జన్యాలకు పాల్పడినా..కొన్ని గ్రామాలలో తిప్పికొట్టినా.. మరిన్ని గ్రామాలలో గొడవల వరకు వెళ్లలేక నిమ్మకుండిపోయారు.

ఎకరాకు రూ.2 లక్షల నష్టపరిహారం చెల్లించాలి



కలెక్టర్‌కు సమస్యలు విన్నవిస్తున్న బొప్పాయి రైతులు

రాయచోటి అర్బన్ : నాసిరకం బొప్పాయితో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.2లక్షల నష్ట పరిహారం చెల్లించాలని రైతులు కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం రైతులు మాట్లాడుతూ కలికిరి, కలకడ, వాయిల్పాడు, గుర్రంకొండ, చిన్నగొట్టిగల్లు, పెద్దమండెం, సదుం, కెవిపల్లిపురం మండలాలకు చెందిన రైతులు నాసిరకం బొప్పాయినారు సాగు చేసి నష్టపోయారన్నారన్నారు. శేఖర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, రాజన్న నర్సరీల యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జమలయ్య, రంగారెడ్డి, లక్ష్మిశేఖర్, రామక్రిష్ణ, మదన్‌మోహన్,ఓబులరెడ్డి, మదన్‌మోహన్, అనిల్‌కుమార్, సుధీర్, శ్రీనివాసులు తదితర బొప్పాయి రైతులు పాల్గొన్నారు.


వామపక్షాల ఆందోళన



కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న రైతు సంఘం నేతలు

రాయచోటి అర్బన్ : దేశ సంపదను లూటీ చేస్తున్న కార్పొరేట్ శక్తుల నుంచి దేశాన్ని కాపాడాలని ఏపీ కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి జమలయ్య, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి డిమాండ్ చేశారు. రాయచోటి కలెక్టరేట్ ఎదుట క్విట్ కార్పొరేట్ ఇండియా అంటూ రైతులు నిరసన ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టే విధానాలు అమలుచేయడం రైతులను మోసం చేయడమే అన్నారు. విత్తన వ్యాపారమంతా మోన్‌శాంటో, బేయర్ కంపెనీల కనుసన్నల్లో నడుస్తోందన్నారు. పంటల బీమా పథకాన్ని దేశ వ్యాప్తంగా ఏడు ప్రైవేటు కంపెనీలకు ఆదాయ వనరుగా మార్చడం తగదన్నారు. కేంద్ర సంస్థల గోదాములను అదానీ సంస్థలకు అప్పచెప్పడం దారుణమన్నారు. వ్యవసాయరంగాన్ని కాపాడుకోవడానికి భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లక్ష్మిరెడ్డి, మదన్‌మోహన్, గంగరాజు, రామక్రిష్ణ, అనిల్‌కుమార్ యాదవ్, నరసింహారెడ్డి, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా అండర్-19 క్రికెట్ టోర్నీ



తలపడుతున్న కడప, కృష్ణా జట్లు

కడప స్పోర్ట్స్: కడప నగరంలో ఏసీఏ అండర్-19 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగుతోంది. వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో కడప జట్టు 77.1 ఓవర్లలో కడప జట్టు 259 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జట్టు వికెట్ కోల్పోకుండా 23 పరుగులు చేసింది.

కేఎస్ఆర్ఎం మైదానంలో..

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో టాస్ గెలిచిన నెల్లూరు జట్టు 85.2 ఓవర్లలో 331 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. విశాఖ బౌలర్ రచిత్ 5 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన విశాఖ జట్టు తొలిరోజున 2 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 16 పరుగులు చేసింది.

కేఓఆర్ఎం మైదానంలో..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో టాస్ గెలిచిన పశ్చిమ గోదావరి జట్టు 74.4 ఓవర్లలో 231 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన శ్రీకాకుళం జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 12 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 58 పరుగులు చేసింది.

రామచంద్ర హత్య కేసులో ఏడుగురు అరెస్టు

జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు



కేసు వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి : పొలంలో నిద్రిస్తున్న ఉసిరికాయల రామచంద్ర (45)ను హత్యచేసిన ఏడుగురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. రాయచోటి జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరులకు ఎస్పీ వివరాలు వెల్లడించారు. కలకడ మండలం వడ్డిపల్లి సమీపంలో జూలై 30వ తేదీన అర్ధరాత్రి పొలంలో కొడుకుతో కలిసి నిద్రిస్తున్న ఉసిరికాయల రామచంద్ర హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ సంఘటనపై కలకడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి డీఎస్పీ రామచంద్రారావు, సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ రామకృష్ణారెడ్డి, సిబ్బందితో కలిసి విచారణ చేశారు. గ్రామంలోని సర్వే నెంబర్-262లో భూమి విషయంపై అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణానికి చెందిన కోటకొండ వెంకటేష్(43)కు మృతుడు రామచంద్రకు మధ్య గొడవలున్నాయి. ఇటీవల వాగ్వాదం పెరిగడంతో రామచంద్రను చంపాలనే నిర్ణయానికి వెంకటేష్ వచ్చారు. ఈ క్రమంలోనే మరో ఆరుగురితో కలిసి హత్య చేసేందుకు రూ.3.70 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ మేరకు పక్కా ప్రణాళికతో జూలై 30న పొలంలో నిద్రిస్తున్న రామచంద్రను ఇనుప రాడ్లతో బాది చంపినట్లు తెలిపారు. ఈ కేసులో నిందుతులు వెంకటేష్‌తోపాటు రామ్మోహన్(39), టి.సురేష్(36), పి.సురేష్ (27), సయ్యద్‌బషీద్‌అలీ(36), షేక్ అష్రఫ్ బాషా(21), షేక్ మహ్మద్ జాఫర్(19)లను అరెస్టు చేసినట్లు ఎస్పీ వివరించారు. వారి వద్ద రెండు రాడ్లు, ఆరు మొబైల్ ఫోన్లు, రూ.17080ల నగదు స్వాధీనం చేసుకున్నారు. హత్య కేసును ఛేదించిన డిఎస్పీ, సీఐ, ఎస్ఐలను సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

పక్కాగా పశు గణన

పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి గుణశేఖర్‌పిళ్లై



కర దీపికను ఆవిష్కరిస్తున్న పశుసంవర్ధక శాఖ జేడీ గుణశేఖర్‌పిళ్లై, జేడీ సత్యనారాయణ

మదనపల్లె : ఐదేళ్లకోసారి పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు గణన కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని పశు సంవర్ధకశాఖ జిల్లా అధికారి గుణశేఖర్ పిళ్లై అన్నారు. స్థానిక పశుసంవర్ధకశాఖ సహాయసంచాలకుల కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. పశుగణనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మార్గనిర్దేశనం చేశారు. ఈ సందర్భంగా గుణశేఖర్‌పిళ్లై మాట్లాడుతూ... జిల్లాలో పశుగణన కార్యక్రమానికి సంబంధించి 278 ఎన్యూమరేటర్లను ఎంపిక చేశామన్నారు. ఎన్యూమరేటర్లు... వారి పరిధిలోని ఇళ్లను సందర్శించి పశువులు, కోళ్లు, గొర్రెలు, మేకలు, పందులు, పెరటి కోళ్లు, పాలిచ్చే పశువులు, కుక్కలు, పెంపుడు కుక్కలు తదితర అంశాలపై సమగ్ర వివరాలివ్వాలని కోరారు. సెప్టెంబర్ 1 నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు 120 రోజుల్లో పశు గణన పూర్తి చేసేలా షెడ్యూల్ ప్రకటించారన్నారు. రైతులు ఉదయం వేళల్లో ఇంటివద్ద అందుబాటులో ఉంటారని, ఉదయం 6 నుంచి 9 వరకు పశుగణన సర్వే చేసేందుకు అనువుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జేడీ కే.సత్యనారాయణ, ఏడీ విశ్వేశ్వరరెడ్డి, రోహిణి తదితరులు పాల్గొన్నారు.

మా భూమిని దౌర్జన్యంగా దున్నేశారు



ప్రెస్ క్లబ్‌లో మాట్లాడుతున్న బాధిత రైతు లక్ష్మన్న, కుటుంబ సభ్యులు

మదనపల్లె : భూ వివాదానికి సంబంధించిన కేసు కోర్టులో ఉన్నప్పటికీ.. దౌర్జన్యంగా తమ భూమిలో ప్రవేశించి దున్నేశారని రామసముద్రం మండలం నారిగానిపల్లె పంచాయతీ పూలకుంట్లవారిపల్లె రైతు లక్ష్మన్న ఆరోపించారు. మదనపల్లె ప్రెస్‌క్లబ్‌లో కుటుంబ సభ్యులతో కలిసి తనకు జరిగిన అన్యాయాన్ని రైతు వివరించారు. పూలకుంట్లవారిపల్లెలో తనకు నాలుగెకరాల పొలం ఉందన్నారు. గ్రామానికి చెందిన శ్రీనివాసులు ఆ భూమిని కాజేయాలనే ఉద్దేశంతో కోర్టులో కేసు వేశాడన్నారు. 2015లో ప్రత్యర్థులకు కోర్టు టెంపరరీ ఇంజెక్షన్ ఆర్డర్ మంజూరుచేసిందన్నారు. తాము కోర్టును ఆశ్రయించగా.. కేసు ప్రస్తుతం విచారణలో ఉందన్నారు. అయితే 2015లోని ఇంజెక్షన్ ఆర్డర్ చూపించి శ్రీనివాసులు పోలీస్, రెవెన్యూ అధికారును వెంటపెట్టుకుని వచ్చి బలవంతంగా పొలం నుంచి తమను బయటకు పంపేశారన్నారు. కోర్టు కేసులో భూమి విషయంలో పోలీసులు కలుగజేసుకుని తమకు అన్యాయం చేస్తున్నారన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

ములకలచెరువు : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు పోలీసులు పేర్కొన్నారు. మండలంలోని బురకాయలకోటకు చెందిన రైతు చంద్రరాజు(38) గురువారం ములకలచెరువు టమాటా యార్డుకు వెళ్లారు. స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో తిరిగి వస్తుండగా పెద్దపాళ్యం గేట్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొంది. తీవ్ర గాయాలైన చంద్రరాజును 108 వాహనంలో మదనపల్లి ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రైతు మృతి చెందాడు.

యువకుడి ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన శివశంకర్

రామసముద్రం : కుటుంబ కలహాలతో ఓ యువకుడి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సంఘటన రామసముద్రంలో చోటుచేసుకుంది. ఆర్.నడింపల్లి పంచాయతీ దిగువబొంపల్లికి చెందిన మల్లప్ప, పద్మావతమ్మల కుమారుడు శివశంకర్(21) వాటర్ కేన్ తీసుకొచ్చే విషయమై కుటుంబీకులతో గొడవపడ్డారు. మనస్తాపానికి గురైన శివశంకర్ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు.

ఏపీఎంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

నిమ్మనపల్లె : గ్రామ సమాఖ్య సమావేశం నిర్వహించకుండా.. బెదిరించి ఆగస్టు 5న మినిట్స్ బుక్‌లో నిమ్మనపల్లె ఏపీఎం రజిని సంతకాలు చేయించుకున్నారని అగ్రహారం పంచాయతీ చైతన్య గ్రామ సమాఖ్య సభ్యురాలు జి.రామలక్ష్మి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. విధుల నుంచి తొలగించిన మహిళను మళ్లీ సంఘమిత్రగా నియమించేందుకు ఏపీఎం ప్రయత్నిస్తోందన్నారు. 24 మంది డ్వాక్రా సభ్యులు, అగ్రహారం సర్పంచి ఉషారాణి సంతకాలతో కూడిన ఫిర్యాదు ప్రతిని రిజిస్టర్ పోస్టు ద్వారా కలెక్టర్ కార్యాలయానికి పంపారు. సంతకాల విషయమై అడిగితే... నీకు సమాధానం చెప్పాలా? అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడారని, సంఘమిత్రగా విజయలక్ష్మిని నియమిస్తున్నామని చెప్పారన్నారు. అవినీతికి పాల్పడిన గత సంఘమిత్ర విజయలక్ష్మిని నియమిస్తే తాము ఒప్పుకునేది లేదన్నారు. మరోసారి ఈ విధంగా వ్యవహరించకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో సర్పంచి ఉషారాణి, కె.శంకరమ్మ, ప్రసన్న లక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి(జగదాంబసెంటర్): జిల్లాలో 2024-25 విద్యా సంవత్సరంలో జరగనున్న నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) పరీక్ష కోసం 8వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, ఎంపీపీ పాఠశాల, వసతి సౌకర్యం లేని ఏపీ ఆదర్శ పాఠశాలలో 8వ తరగతి చదువుతూ, కుటుంబ సంవత్సర ఆదాయం రూ.3.50 లక్షలలోపు ఉన్న విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. ఈ పరీక్ష డిసెంబర్ 8వ తేదీన జరుగుతుందన్నారు. పరీక్ష రుసుం ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.50. ఉంటుంది. www.bre.ap.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని డీఈఓ తెలిపారు.